## భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ముగ్గురి సస్పెన్షన్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, మే 9 (నమస్తే తెలంగాణ): ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని నెమ్మికల్‌లో వివాదాస్పద భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడంలో బాధ్యులైన ముగ్గురిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'రెవెన్యూలో అక్రమార్కులు' శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనానికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పందించి ఘటనపై విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ పి.రాంబాబును నియమించారు. అదనపు కలెక్టర్ విచారణ చేపట్టి రిజిస్ట్రేషన్‌లో తప్పులు జరిగినట్లు కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. అక్రమాలకు బాధ్యులుగా గుర్తించి డిప్యూటీ తాసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఆర్ఐ కె.రమేశ్‌ను సస్పెండ్ చేయడంతో పాటు గతంలో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లాలో పని చేస్తున్న ఇంద్రకుమార్‌ను సస్పెండ్ చేయాల్సిందిగా సీసీఎల్ఏకు కలెక్టర్ సిఫారసు చేశారు. అంతేకాకుండా నాటి తాసీల్దార్ జి.వినోద్‌కుమార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి చార్జ్ మెమో ఇస్తూ సీసీఎల్ఏకు పంపినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

### సూర్యాపేట ఆర్డీఓకు నోటీసు

వివాదాస్పద భూమి విషయంలో ఈ నెల 15న సంబంధిత పత్రాలు, లిఖితపూర్వక వివరణతో కలెక్టర్ ఎదుట హాజరు కావాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావుకు అదనపు కలెక్టర్, విచారణ అధికారి రాంబాబు నోటీసు జారీ చేశారు. పహాణీలు, 1ఏ రిజిస్టర్, సవరణ రిజిస్టర్ వంటి రెవెన్యూ రికార్డులు, 13బీ సర్టిఫికెట్లలో తీవ్రమైన వ్యత్యాసాలతో ముఖ్యమైన ఫైళ్లను ప్రాసెస్ చేసి సరైన వెరిఫికేషన్ లేకుండా ఉన్నతాధికారులకు పంపడంతో పర్యవేక్షణ లోపం కూడా ఉందని విచారణలో గుర్తించారు.

## 'రక్తదానం ప్రాణదానంతో సమానం'



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ కోటాచలం

సూర్యాపేట టౌన్, మే 9: సమాజంలో అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని రక్షించేందుకు మనం అందించే రక్తం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం, సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. ఈ నెల 12న నర్సింగ్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయొచ్చని తెలిపారు. తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి గాజుల నరేశ్ ఆధ్వర్యంలో 50 మంది నర్సింగ్ ఆఫీసర్లు రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు డాక్టర్ జనార్దన్, డాక్టర్ వినయ్, నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శివనాయు, జిల్లా అధ్యక్షుడు కొండల్, జిల్లా జనరల్ సెక్రటరీ నాగరాజు, తలారి స్వప్న, దుర్గాప్రసాద్, పి.రాజు, రాజీవ్, జగన్, శ్రీకాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష



కలకోవ గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

మునగాల, మే 9: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారిణి శిరీష హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి లబ్ధిదారులకు తగిన సూచనలు ఇవ్వాలని తెలిపారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు ఎటువంటి తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్ చేసి బ్యాంకులకు పంపాలని సూచించారు. అనంతరం తాడువాయి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను, కలకోవ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్, ఏపీఓ శైలజ, కార్యదర్శులు, టీఏలు రాంబాబు, శ్రీధర్‌రెడ్డి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు'




ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతలపాలెం, మే 9: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని హుజూర్‌నగర్ డివిజన్ హార్టికల్చర్ అధికారి ప్రదీప్తి అన్నారు. మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలో పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లాభాలు, రాయితీల గురించి రైతులకు వివరించారు. ప్రభుత్వం బిందు సేద్యం పరికరాలు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీతో, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో, ఇతర పెద్ద రైతులకు 80 శాతం సబ్సిడీతో ఇస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ రాయితీని వినియోగించుకొని ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సాయి, ఫీల్డ్ అసిస్టెంట్లు రవి, సురేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా నదిలో మునిగి యువకుడి మృతి

చింతలపాలెం, మే 9: మండలంలోని తమ్మవరం గ్రామానికి చెందిన సూరగాని అయోధ్య (20) అనే యువకుడు ప్రమాదవశాత్తు కృష్ణా నదిలో మునిగి మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అయోధ్య రోజు మాదిరిగానే గురువారం పశువులను మేత కోసం అడ్లూరు సమీపంలోని కృష్ణా నది వైపు తోలుకెళ్లాడు. ఈ క్రమంలో పశువులు నదిలోని ఓ పాయలో ఉన్న మేత కోసం వెళ్లగా వాటిని తోలుకొచ్చేందుకు వెళ్లిన అయోధ్య ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. సాయంత్రం అయినప్పటికీ అయోధ్య ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అనుమానంతో నది వద్దకు వెళ్లగా ఒడ్డున చెప్పులు కనిపించాయి. నదిలో గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. అయోధ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అయోధ్య తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## 'సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోదాడ రూరల్, మే 9: కార్మిక చట్టాల రక్షణ కోసం ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కోదాడ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఆర్ఎస్‌కేవీ నాయకులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను పాలకులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.ముత్యాలు, వక్కంతుల నరసింహారావు, ఎస్‌కే.నయీం, ఎస్‌కే.లతీఫ్, రాఘవరెడ్డి, శ్రీనివాస్, సైదులు, కాంతారావు, రేపూరి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

## 'ధాన్యం కాంటాలు త్వరగా పూర్తిచేయాలి'

తిరుమలగిరి, మే 9: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు త్వరగా పూర్తిచేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సీపీఎం జిల్లా నాయకుడు కడెం లింగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రం తిరుమలగిరిలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 20 రోజులకు పైగా పడిగాపులు కాస్తున్నారని, అయినా పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కూడ రైతులు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొన్నదని అన్నారు. అధికారులు వెంటనే కాంటాలు పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, రమేశ్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా సాగుతున్న మట్టి దందా

- అనుమతులు లేకుండా తరలింపు
- సొమ్ము చేసుకుంటున్న ముఠా



ఇటీవల పట్టుబడిన మట్టి టిప్పర్లు (ఫైల్)

హుజూర్‌నగర్, మే 9: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మట్టి దందా మూడు పూలు, ఆరు కాయలు అన్న చందంగా జోరుగా సాగుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు ముఠాగా ఏర్పడి హుజూర్‌నగర్, చిలుకూరు వద్ద గుట్టలను భారీ యంత్రాల సాయంతో చదును చేస్తూ మట్టిని కొల్లగొడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొద్దిరోజులుగా వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టిని హుజూర్‌నగర్‌లోని వెంచర్లకు, వ్యవసాయ భూములకు తరలిస్తూ కాసుల పంట పండించుకుంటున్నారు. హుజూర్‌నగర్ పట్టణంలో భారీ వాహనాలకు అనుమతి లేకపోయినా మట్టి మాఫియా టిప్పర్లు యథేచ్ఛగా తిరుగుతుండడం వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టి టిప్పర్లు మితిమీరిన వేగంతో రావడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. సుమారు మూడు రోజుల క్రితం అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ అధికారులు హుజూర్‌నగర్‌లో పట్టుకున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా మట్టి దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

- నాగార్జునరెడ్డి, హుజూర్‌నగర్ తాసీల్దార్

అనుమతి లేకుండా మట్టిని రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మాకు లభించిన సమాచారం మేరకు ఇప్పటికే నాలుగు టిప్పర్లను సీజ్ చేశాం. మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

## చట్టానికి వ్యతిరేకంగా ప్రాక్టీస్ చేసే డాక్టర్లపై చర్యలు : ఐఎంఏ



సమావేశానికి హాజరైన వైద్యులు

సూర్యాపేట టౌన్, మే 9: ప్రైవేట్ వైద్యరంగం ప్రక్షాళన కోసం మొదటిసారిగా ఐఎంఏ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం వైద్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సూర్యాపేటలోని 150 మందికి పైగా క్వాలిఫైడ్ డాక్టర్లు హాజరయ్యారు. డాక్టర్ల ప్రాక్టీస్, హాస్పిటల్స్, ల్యాబ్స్, ఇతర క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు సంబంధించిన చట్టాలు, నియమ నిబంధనలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. చట్టాలకు వ్యతిరేకంగా ప్రాక్టీస్ చేసే ఏ వ్యక్తిపై అయినా కఠిన చర్యలు తీసుకుంటామని ఐఎంఏ స్పష్టం చేసింది. నియమానుసారంగా పని చేసే డాక్టర్లకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వారి కోసం పోరాడుతామని పేర్కొన్నారు. డాక్టర్ లేని సందర్భాల్లో అర్హత లేని వ్యక్తులు చికిత్స చేయడం వంటి చర్యలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడ్డారు. సమావేశంలో తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ వి.నరేశ్‌కుమార్, డాక్టర్ ఎం.రాజీవ్‌తో పాటు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్, సెక్రటరీ డాక్టర్ ఎల్.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్



దుర్గా భవాని దాబాకు జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

హుజూర్‌నగర్, మే 9: హోటళ్లు, రెస్టారెంట్లలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుజూర్‌నగర్ మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు దాబాలు, రెస్టారెంట్లు, బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన చికెన్, ఇతర ఆహార పదార్థాలను విక్రయిస్తున్న దుర్గా భవాని దాబా (చౌదరి దాబా)కు రూ.2 వేలు, తెలుగింటి రుచులు రెస్టారెంట్‌కు రూ.2 వేలు, ఫాంటసీ బేకరీకి రూ.500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వ ఆహార పదార్థాలను అంటగట్టి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడొద్దని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగారం, మే 9: నాగారం, ఫణిగిరి సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపట్టనున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మహేందర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగారం, వర్ధమానుకోట, డి.కొత్తపల్లి, నర్సింహులగూడెం, మాచిరెడ్డిపల్లి, ఈటూరు, ఫణిగిరి, మామిడిపల్లి, అనంతారం, మాలిపురం గ్రామాల్లో సరఫరాలో అంతరాయం కలుగనుందని తెలిపారు.

## 'సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ'

నేరేడుచర్ల, మే 9: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. నేరేడుచర్ల పట్టణంలోని బంగారు దుకాణాల యజమానులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాలపై ఎస్ఐ రవీందర్‌తో కలిసి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని,బంగారు దుకాణాల యజమానులు కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బంగారు దుకాణాల యజమానులు రాచకొండ విజయ్, కీతా భద్రయ్య, సైదులు, అరవింద్, లక్ష్మణ్, అమృతాచారి, అశోక్‌చారి, అంకారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి పథకంతో ఆర్థికాభివృద్ధి : తాసీల్దార్

పెన్‌పహాడ్, మే 9: ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించొచ్చని తాసీల్దార్ లాలునాయక్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నారీ టీ స్టాల్‌ను ఎంపీడీఓ వెంకటేశ్వర్లుతో కలిసి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. నైపుణ్యం ఉన్నా ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇంటికే పరిమితమైన గ్రామీణ ప్రాంత మహిళలకు ఇదొక మంచి అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అజయ్, ఆశ, జ్యోతి, విజయ, పాల్, సైదులు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## 'రైతులను ఆదుకోవాలి'

ఆత్మకూర్.ఎస్, మే 9: ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగక అకాల వర్షాల కారణంగా తడిసిపోతుందని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి నర్సమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వారు పరిశీలించి మాట్లాడారు. పిడమర్తి వెంకన్న, పిడమర్తి చిన్న రాములు, పోతురాజు అంజి, గోనె అంజయ్య అనే రైతులు నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోశారని, తేమ శాతం వచ్చినప్పటికీ మూడు రోజులకు ఒకసారి ధాన్యం లోడు ఎత్తుతుండడంతో నీటిపాలు అయిందని తెలిపారు. ఇప్పటికైనా త్వరితగతిన కాంటాలు వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప్పల పద్మ, రాములు, వెంకన్న, మల్లయ్య, అంజమ్మ, వెంకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు

మఠంపల్లి, మే 9: మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్ నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ శుక్రవారం తెలిపారు. ఈ నిధులతో దేవాలయంలో శ్రీలక్ష్మీనరసింహ యాత్రిక సదనము, శ్రీ వరాహ నిలయం, భక్తులకు తాగునీటి సౌకర్యం కోసం ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్, ప్రసాదాల తయారీ హాల్, అన్నదానం నిర్వహణ హాల్, ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్లు, రాజగోపురం వద్ద పీపీఈజీఐ షెడ్డు పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సూర్యాపేట టౌన్, మే 9: మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష, మరికొందరికి జరిమానా పడినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిని పట్టుకొని కోర్టులో హాజరు పర్చగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ ఒకరికి ఒక రోజు జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించగా, మరో ముగ్గురికి రూ.1,500 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## 'మతోన్మాద శక్తులపై పోరాడాలి'

సూర్యాపేట టౌన్, మే 9: మతోన్మాద శక్తులు విజృంభిస్తున్న తరుణంలో ఫాసిజంపై అరుణ సైన్యం సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఫాసిజంపై ఎర్ర సైన్యం విజయం సాధించి 80 ఏండ్లు అవుతున్నందున జిల్లా కేంద్రం సూర్యాపేటలోని సీడబ్ల్యూసీ గోదాంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుబు మట్టిపల్లి సైదులు, నాయకులు చినపంగి నర్సయ్య, వి.సాయికుమార్, సీడబ్ల్యూసీ హమాలీ యూనియన్ అధ్యక్షుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## 13న బీసీ హక్కుల సాధన సమితి జిల్లా మహాసభ

గరిడేపల్లి, మే 9: కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్ ఎల్ఐసీ బిల్డింగ్స్‌లో ఈ నెల 13వ తేదీన జరుగనున్న బీసీ హక్కుల సాధన సమితి 3వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం గరిడేపల్లిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణనలో కులగణన చేపడతామని ప్రకటించడం హర్షణీయమన్నారు. బీసీల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై మహాసభలో చర్చించి ఉద్యమాలను రూపొందించనున్నట్లు వెల్లడించారు.

## బూరుగడ్డ నల్లచెరువు గండి పూడ్చివేత

హుజూర్‌నగర్ రూరల్, మే 9: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో నల్లచెరువు కట్టకు గండిపడడంపై ఈ నెల 7న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'బూరుగడ్డ నల్లచెరువు కట్టకు గండి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి శుక్రవారం గండి పూడ్చి వేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చెరువు కట్టకు గండి పెట్టడంతో చెరువు ఖాళీ అయి గ్రామంలో భూగర్భ జలాలు తగ్గి బోర్లు, బావులు వట్టిపోయే ప్రమాదం ఉందని స్థానిక రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై నీటిపారుదల శాఖ డీఈకి సమాచారం అందడంతో సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపించి గండిని పూడ్చి వేశారు. చెరువుకు గండి పెట్టిన వారిపై చర్యలు తప్పవని అధికారులు పేర్కొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

కోదాడ టౌన్, మే 9: కోదాడ వాసవి యూత్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్లా రామకృష్ణ అన్నారు. కోదాడ పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో బాటసారులకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పబ్బా గీత, చల్ల విజయశేఖర్, వంగవీటి లోకేశ్, పోలిశెట్టి నవీన్, జగిని ప్రసాద్, సతీశ్‌బాబు, శ్రీనివాసరావు, భరత్ కుమార్, సైదారావు, మాధవి, అనంత చక్రవర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో చోరీ

నాగారం, మే 9: మండలంలోని ఫణిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. హైస్కూల్‌లోని మూడు గదులు, ప్రాథమిక పాఠశాలలోని రెండు గదుల తాళాలు పగులగొట్టిన దుండగులు వంట పాత్రలను దొంగిలించారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శుక్రవారం ఫిర్యాదు చేశారని ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు.

## గొలుసు దొంగతనం కేసులో మహిళకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు

నేరేడుచర్ల, మే 9: నేరేడుచర్ల పట్టణంలోని గ్రంథాలయం వీధిలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును అపహరించిన మహిళను 24 గంటల్లోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. శుక్రవారం నేరేడుచర్లలో పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని 11వ వార్డులో ఉంటున్న గుండా చంద్రకళ ఇంటికి గురువారం ఓ మహిళ వచ్చి మంచినీళ్లు అడిగి ఆమెతో మాటలు కలిపింది. అనంతరం తన వెంట తీసుకొచ్చిన కారాన్ని చంద్రకళ కండ్లలో కొట్టి ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టణంలోని హుజూర్‌నగర్ బస్టాప్ వద్ద అమరారపు మంజుల అనే మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో ఆమెను మహిళా పోలీసులు తనిఖీ చేయగా బంగారు గొలుసు కనిపించింది. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టగా చంద్రకళ మెడలోని గొలుసును దొంగతనం చేసినట్లు అంగీకరించింది. దీంతో మంజులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మంజుల పట్టణంలోని పలు ఇండ్లల్లో పని చేస్తున్నట్లు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో పోలీస్ సిబ్బంది వీరాంజనేయులు, వెంకన్న, విష్ణు, శ్రీలత, జ్యోతి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

- మండల వైద్యాధికారి నరేశ్



క్షయ వ్యాధి పరీక్షలు చేస్తున్న మండల వైద్యాధికారి నరేశ్, వైద్య సిబ్బంది

గరిడేపల్లి, మే 9: క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి వి.నరేశ్ తెలిపారు. మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామంలో శుక్రవారం 18 మంది అనుమానితులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ రహిత భారతదేశ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని, వ్యాధి నిర్ధారణ అయితే 6 నెలల పాటు ప్రభుత్వం ఉచితంగా మందులు, పోషకాహార కిట్లు అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఎం.శారద, సూపర్‌వైజర్ ఎ.అంజయ్యగౌడ్, ఎల్‌టీ ఉపేందర్, ఏఎన్ఎం కవిత, ఆశ కార్యకర్త కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి 'భూభారతి' : ఆర్డీఓ

గరిడేపల్లి, మే 9: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని సర్వారం, పొనుగోడు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించారు. రైతులు తమ భూ సమస్యలపై ఆధారాలతో సహా వివరిస్తూ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పొనుగోడులో 321, సర్వారంలో 118 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఏఓ రాజేందర్, తాసీల్దార్ బండ కవిత, డిప్యూటీ తాసీల్దార్ స్రవంతి, తబ్రేజ్, ఆర్ఐలు ప్రవీణ్, రాంబాబు, జాన్‌కాన్, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 'భీంరెడ్డి నర్సింహారెడ్డి ఆశయాలను సాధించాలి'



సూర్యాపేట టౌన్: భీంరెడ్డి నర్సింహారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, మే 9: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే భీంరెడ్డి నర్సింహారెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి వరికుప్పల వెంకన్న, పూర్వ మిత్ర మండలి అధ్యక్షుడు నల్లగుంట్ల అయోధ్య అన్నారు. భీంరెడ్డి నర్సింహారెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీంరెడ్డి నర్సింహారెడ్డి జీవితం తెరిచిన పుస్తకమని, తెలంగాణ సాయుధ పోరాటానికి ఆద్యుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, బొమ్మిడి లక్ష్మీనారాయణ, చెరుకు యాకలక్ష్మి, సత్యం, దేవత్ కిషన్‌నాయక్, చామకూరి నర్సయ్య, బుద్ధ సత్యనారాయణ, పంతంగి వీరస్వామిగౌడ్, జలగం సత్యం, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భీంరెడ్డి నర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, యాదగిరి, పొరెల్ల లక్ష్మయ్య, ఎల్లయ్య, చేను శ్రీనివాస్, అబ్రహం, రెహమాన్, చాంద్‌పాషా, వంగరి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం



సమ్మర్ క్యాంపునకు హాజరైన విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, మే 9: నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి మాట్లాడుతూ పట్టణానికి చెందిన నిమ్మల పాండురంగారావు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు, ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, కోశాధికారి యూసుఫ్, సభ్యులు కోటేశ్వరరావు, పూర్ణచంద్రారెడ్డి, శ్రీను, కనకయ్య, ఉపాధ్యాయులు యాదగిరి, బాలు, నగేశ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో వేసవి శిబిరాలు

- జిల్లాలో 50 స్కూళ్లలో నిర్వహణ
- విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ




నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు క్యారమ్స్, చెస్‌లో శిక్షణ ఇస్తున్న శిక్షకులు

నేరేడుచర్ల, మే 9: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 10 నుంచి 24వ తేదీ వరకు వేసవి శిబిరాలను నిర్వహించనున్నారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం 50 పాఠశాలల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో ఇప్పటికే కొన్నింట్లో ముందుగానే శిక్షణలు ప్రారంభం కాగా, మరికొన్ని చోట్ల ప్రారంభించాల్సి ఉంది. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఈ శిబిరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. తొలిసారిగా గ్రామీణ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మండల కేంద్రాల్లో వేసవి శిబిరాలు ఏర్పాటు చేయడంతో ప్రయోజనం చేకూరనుంది.

### ఉదయం 8 గంటల నుంచి..

జిల్లాలోని 50 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరాలను నిర్వహిస్తారు. ఒక్కో పాఠశాలలో కనీసం వంద మంది చొప్పున ఐదు వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించి దానికి అనుగుణంగా నిర్వహిస్తున్నారు. ఒక్కో కేంద్రంలో నలుగురు శిక్షకుల సాయంతో కనీసం నాలుగు అంశాల్లో అవగాహన కల్పించాల్సి ఉంటుంది. శిక్షణ సమయంలో విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వనుండగా, శిక్షకులకు గౌరవ వేతనం అందిస్తారు.

### ప్రవేశాలు ఇలా

శిబిరాల్లో ప్రవేశానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఇస్తారు. ఆధార్ కార్డు, పాఠశాల వివరాలతో హాజరైతే ప్రవేశం కల్పిస్తారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు సమాచారం ఇస్తున్నారు.

### శిక్షణ అంశాలు

మండల కేంద్రాల్లో వనరులు, శిక్షకులు సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని శిక్షణ అంశాలను ఎంపిక చేశారు. చదరంగం, క్యారమ్స్, స్కిప్పింగ్, వైకుంఠపాళి తదితర ఆటలే కాక డ్రాయింగ్, పెయింటింగ్, కాగితాలతో బొమ్మలు తయారు చేయడంపై శిక్షణ ఉంటుంది. అంతేకాక చిన్న చిన్న సైన్స్ ప్రయోగాలు, కర్రసాము, యోగా, నృత్యం, సంగీతం, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ బేసిక్స్ నేర్పిస్తారు.